# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 24-5-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 220 పేజీలు:6 వెల: రూ.1/-


## గ్రామ పంచాయతీలకు రూ.1190 కోట్లు విడుదల..

హైదరాబాద్, మే23: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలకు రూ. 1190 కోట్ల నిధులు విడుదల చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు మంగళవారం ఆర్థిక మంత్రి హరీశ్ రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుసమావేశమై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల లో వివిధ పనులకు సంబంధించి సంబంధిత అధికారులతో చర్చించి నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. ఈ నిధులను విడుదల చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయం పట్ల సర్పంచ్ ల సంఘం ప్రతినిధులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును హైదరాబాద్ లోని మంత్రుల నివాసంలో కలిసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు.. సీఎం కేసీఆర్ తోపాటు, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, హరీశ్ రావుకు కృతజ్ఞతలుతెలిపారు. సీఎం కేసీఆర్ మనసున్న మహారాజని కొనియాడారు. మాట తప్పకుండా, అందరి శ్రేయోభిలాషిగా ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రగతిని దృష్టిలో పెట్టుకుని, ఎన్ని ఇబ్బందులు ఉన్నా, నిధులు విడుదల చేస్తూ అభివృద్ధిని నిరాటంకంగా కొనసాగిస్తున్నారని అన్నారు.

## తెలంగాణలో రెండు రోజులు వానలు..!

హైదరాబాద్, మే23: తెలంగాణలో రాగల రెండు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం పేర్కొంది. ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. బుధవారం రాష్ట్రంలోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ నెల 25 నుంచి రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడుతుందని వివరించింది. ఇదిలా ఉండగా.. మంగళవారం పలు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నాగర్ కర్నూల్‌తో పాటు పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది.

## రాష్ట్రంలో సజావుగా ధాన్యం కొనుగోళ్లు : మంత్రి గంగుల



హైదరాబాద్, మే23: ధాన్యం కొనుగోళ్లు రాష్ట్రంలో వేగంగా, సజావుగా కొనసాగుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మంగళవారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ధాన్యం కొనుగోళ్లపైపౌర సరఫరాల కమిషనర్ అనిల్ కుమార్‌తో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంగళవారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 38.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని తెలిపారు. ఇది గత సీజన్ కన్నా 10 లక్షల మెట్రిక్ టన్నులు అధికమని వివరించారు.

కేంద్ర సహకారం ఆశించినంత లేకున్నా యాసంగి ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో సేకరిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7వేల కొనుగోలు కేంద్రాల ద్వారా 7907 కోట్ల విలువ గల ధాన్యాన్ని 6లక్షల 5వేల మంది రైతుల నుంచి సేకరించామని వెల్లడించారు. కొన్ని రోజులుగా సరాసరి రోజుకు లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తున్నామన్నారు. ధాన్యం సేకరణ పూర్తయిన 400 కేంద్రాలను మూసేసామని తెలిపారు.

ఎఫ్‌సీఐ నిర్దేశించిన కనీస నాణ్యతా ప్రమాణాలను రైతులు పాటిస్తే ఇబ్బందులు ఉండవని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశామని, సమస్యలున్న చోట అధికార యంత్రాంగం తక్షణమే స్పందిస్తుందని అన్నారు. విపత్కర పరిస్థితుల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తూ రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. ఇదే అంశంపై బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమస్యలను మరింత వేగంగా పరిష్కరిస్తామన్నారు.


నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



(మే 24 ప్రపంచ ఉత్పత్తుల దినోత్సవం...)
World Product Day..

-రాధశ్రీ
సెల్:9494481210


## జూన్ 9న చేప ప్రసాదం పంపిణీ.. మంత్రి తలసానిని కలిసిన బత్తిన కుటుంబ సభ్యులు



హైదరాబాద్, మే23: చేప ప్రసాదం పంపిణీకి ముహూర్తం ఖరారైంది. మూడేండ్ల తర్వాత చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను బత్తిన కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం కలిశారు. ఈ సందర్భంగా చేప పంపిణీ ప్రసాదంపై మంత్రి తలసానితో బత్తిన కుటుంబ సభ్యులు చర్చించారు. జూన్ 9న మృగశిర కార్తె సందర్భంగా చేప ప్రసాదం పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేయనున్నారు.

ప్రతి ఏటా మృగశిర కార్తె సందర్భంగా అస్తమా బాధితులకు బత్తిన సోదరులు ఉచితంగా చేప ప్రసాదం పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే కరోనా కారణంగా చేప ప్రసాదం పంపిణీ గత మూడేండ్లుగా నిలిచిపోయింది. ఈ ఏడాది నుంచి చేప ప్రసాదం పంపిణీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో ఎప్పటిలాగే నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బత్తిన సోదరులు ఉచితంగా చేప ప్రసాదం పంపిణీ చేయనున్నారు. చేప ప్రసాదం కోసం ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఉబ్బసం వ్యాధి గ్రస్తులు హైదరాబాద్‌కు వస్తుంటారు. బత్తిన సోదరులు అందించే చేప ప్రసాదం కోసం జనాలు కిలోమీటర్ల మేర బారులు తీరుతారు. కరోనా తర్వాత తొలిసారి చేప ప్రసాదం పంపిణీ చేస్తుండటంతో ఈ సారి జనం భారీగా తరలి వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు భావిస్తున్నారు. ఇందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. దాదాపు 170 ఏళ్ల నుంచి బత్తిన వంశస్తులు అస్తమా పేషెంట్ల కోసం నగరంలో చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. కానీ కరోనా వైరస్ వ్యాప్తితో మూడేళ్ల కిందట 2020లో తొలిసారి చేప ప్రసాదం పంపిణీకి బ్రేక్ పడింది. కరోనా వ్యాప్తి చెందుతున్న కారణంగా, కొవిడ్19 నిబంధనలు పాటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేప ప్రసాదం పంపిణీకి అనుమతి ఇవ్వలేదు.

## యూపీఎస్సీ సివిల్స్ 2022 తుది పరీక్షల ఫలితాలు విడుదల

### -ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇషితా కిశోర్ తొలి ర్యాంకు
### -తెలంగాణకు చెందిన ఉమా హారతి ఎన్ మూడో ర్యాంకు

హైదరాబాద్ మే 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ 2022 తుది పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. దేశ వ్యాప్తంగా 933 మందిని ఎంపిక చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇషితా కిశోర్ తొలి ర్యాంకు సాధించగా, తెలంగాణకు చెందిన ఉమా హారతి ఎన్ మూడో ర్యాంకు సాధించారు. మూడో ర్యాంకు సాధించిన నూకల ఉమా హారతి.. నారాయణపేట ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు కుమార్తె. ఉమా హారతి స్వస్థలం సూర్యాపేట జిల్లాలోని హుజుర్‌నగర్. సివిల్స్ తుది ఫలితాల్లో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన పలువురు అభ్యర్థులు ఎంపికయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గుంటూరుపల్లికి చెందిన శాఖమూరి శ్రీసాయి హర్షిత్ 40వ ర్యాంకు, జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు శివ మారుతి రెడ్డి 132వ ర్యాంకు సాధించారు. బీవీఎస్ పవన్ దత్తా 22వ ర్యాంకు, హెచ్ఎస్ భావనకు 55, సాయి ప్రణవ్‌కు 60, నిధి పాయ్ 110, అంకుర్ కుమార్ 257, చల్లా కళ్యాణి 285, వై శృతి 362, శ్రీకృష్ణ 293, హర్షిత 315, లక్ష్మి సుజిత 311, సోనియా కటారియా 376, రేవయ్య 410, సీహెచ్ శ్రవణ్ కుమార్ రెడ్డి 426, రామ్‌దేని సాయినాథ్ 742, రెడ్డి భార్గవ్ 772, నాగుల కృపాకర్ 866వ ర్యాంకు సాధించారు.

మెయిన్స్‌లో అర్హత సాధించిన వారిని పర్సనాలిటీ టెస్టు కోసం ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు ఇంటర్వ్యూ చేసింది.

ఫైనల్‌గా 933 మందిని వేర్వేరు సర్వీసులకు ఎంపిక చేసింది. మొత్తం 345 మంది జనరల్ కోటాలో ర్యాంకులు సాధించారు. ఇక 99 మంది EWS కోటాలో, 263 మంది OBC కోటాలో, 154 మంది SC కోటాలో, 72 మంది ST కోటాలో 2022 సివిల్ సర్వీసులకు ఎంపికయ్యారు.

## దశాబ్ది ఉత్సవాల్లో మహిళా,శిశు సంక్షేమ శాఖ విజయాలను వివరించాలి : మంత్రి సత్యవతి రాథోడ్



హైదరాబాద్, మే23: రాష్ట్రంలో పదేండ్లుగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమా లు , సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని రాష్ట్ర గిరిజన,స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మం గళవారం అధికారులు , డాక్యుమెం టరీ ఏజెన్సీ సిబ్బంది తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు.

జూన్ 2 నుంచి ప్రారంభమయ్యే 21 రోజుల దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అంగన్ వాడీలు, మహిళా సమాఖ్యల వద్ద కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా శిశు సంక్షేమానికి పెద్ద పీట వేశారని పేర్కొన్నారు. మహిళల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని వెల్లడించారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషుడి కంటే దీటుగా రాణిస్తున్నారని అన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేకంగా షీ టీమ్, సఖి, భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసామని ఆమె తెలిపారు .అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు , బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళల సాధికారత కోసం అనేక పథకాలు అమలు చేస్తుందని, దశాబ్ది ఉత్సవాలలో గ్రామీణ స్థాయి నుంచి ఈ అంశాలను ప్రజలకు తెలిసే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మహిళా అభివృద్ధి, సంక్షేమ శాఖ కార్యదర్శి భారతి హోలీ కెరీ, డాక్యుమెంటరీ ఏజెన్సీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## "పే బ్యాక్ టు సొసైటీ"ఆధ్వర్యంలో విద్యార్థులకు చేయూత



ఖమ్మం, మే23: (నేటినిజం ప్రతినిధి): గౌతమ బుద్ధుని ఆలోచనలతో,జ్యోతిభాపూలె,డా బిఆర్ అంబేద్కర్-భాగ్యరెడ్డి వర్మల ఆశయ సాధనలో భాగంగా... పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆసరాగా వైరా మండలానికి చెందిన మెడిసిన్,ఇంజనీరింగ్ చదివే విద్యార్థులైన పానెం సోనీ,చంద్రశేఖర్ కు మరియు"శైలింగ్"లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 15 గోల్డ్ మెడల్స్ సాధించిన పిల్లి"అఖిల్"కు"పే బ్యాక్ టు సొసైటీ" ఆధ్వర్యంలో సంస్థ సభ్యులైన కాల్వ దేవదాన్(కే ఎన్ ఎల్ టెక్నా?(క్రాట్స్-పాల్వంచ),ఖమ్మం"శాన్వి" హాస్పిటల్ డా. శివకృష్ణ-డా శశాంక దంపతులు మరియు ఖమ్మం"సుజాత"హాస్పిటల్ ఎమ్ డి రెంటాల భరత్,ఎమ్ జయరాజ్,జమ్మి జైపాల్,జె సంజీవరావు మరియు సొసైటీ సహాయంతో... పేదరికంలో ఉండి కూడా ఎంతో కష్టపడి పిల్లల్ని చదివిస్తున్న విద్యార్థుల తండ్రికి,మెమోంటోని అందించి కుమార్తె మెడిసిన్ విద్యార్థిని పి.సోని ని సన్మానించి పదివేల రూపాయలు అందించడం జరిగినది.శైలింగ్ లో అంతర్జాతీయ స్థాయిలో రానిస్తున్న అఖిల్ కి వెన్నంటి ఉంటూ నిత్యం సహకారం అందిస్తున్న వారి బాబాయ్ పిల్లి రాజు పోలీస్ కానిస్టేబుల్ ఏసిబికి పదిహేను వేల రూపాయలను సహాయంగా అందించి వారిని ఘనంగా సన్మానించడం జరిగినది.కార్యక్రమానుద్దేశించి శాన్వి హాస్పిటల్ దంపతులు మాట్లాడుతూ...ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులకు మరియు మనమొచ్చిన సమాజానికి ఎంతో కొంత సేవచేయడం అదృష్టంగా భావిస్తున్నాము అని పేర్కొన్నారు.పేద విద్యార్థుల ఉన్నతి విద్యకు చేతనైనంత వరకు ఎంతో కొంత సహాయం చేస్తూ వారికీ ఆసరాగా నిలవడమే "పే బ్యాక్ టు సొసైటీ"లక్ష్యం అని,దీనిలో ఉద్యోగ మేధావులైన ప్రొఫెషనల్స్ సభ్యులుగా చేరి సొసైటీ ని ఇంకా ముందుకు తీసుకోపోవడానికి ఎక్కువ మంది పేద విద్యార్థులకు సహాయం చేసేలా సహకరించాలని వ్యవస్థాపకులు జంగం లక్ష్మణ్ రావు,చిలకబత్తిన కనకయ్య తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గులగట్టు యల్లయ్య, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ జిల్లా చైర్మన్ పప్పుల వేణుగోపాల్, పిల్లి అభిలాష్, సవ్వడి సెల్ ఫోన్స్ అధినేత పి.శ్రీనివాస్-వాసు,జి.సాయిబాబు, బి.మోహన్ రావు,గుడిపుడి.కృష్ణ మరియు శాన్వి హాస్పిటల్ సిబ్బంది అంజయ్య, వెంకటనారాయణ, కిరణ్,సౌజన్య,లావణ్య,అఖిల్,నిర్మల,పవన్,శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ శాఖ పునర్ వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

హైదరాబాద్ మే 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): పంచాయతీరాజ్ శాఖ పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా 4 చీఫ్ ఇంజినీర్, 12 సర్కిల్ ఇంజినీర్, 11 డివిజన్ ఇంజినీర్, 60 సబ్ డివిజన్ ఇంజినీర్ పోస్టులను మంజూరు చేసింది ప్రభుత్వం. వివిధ స్థాయిల్లో ఇంజినీర్లకు పనులు మంజూరు చేసే అధికారం కల్పించింది. డీఈఈకి ఏడాదికి రూ. 5 లక్షలు, ఈఈకి ఏడాదికి రూ. 25 లక్షల వరకు అనుమతి ఇచ్చింది.

## మత్స్య సహకార సొసైటీల చైర్మన్ పిట్టల రవీందర్‌కు అభినందనలు



హైదరాబాద్ మే 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : రాష్ట్ర మత్స్య సహకార సొసైటీల ఛైర్మెన్ పిట్టల రవీందర్ కు ఘనంగా సత్కరించారు. ఈ మేరకు మాసాబ్యాంక్ లోని మత్స్యభవన్లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణా మత్స్యకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్.నిర్మలా ముదిరాజ్, మత్స్య సహకార సొసైటీల ఛైర్మెన్ గా పిట్టల రవీందర్ ను కలిసి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మల ముదిరాజ్ మాట్లాడుతూ పిట్టల రవీందర్ నేతృత్వం లో రాష్ట్ర మత్స్య సహకార సొసైటీలు మరింత బలోపేతం కాగలవన్న ఆశ బావాన్ని వ్యక్తం చేసారు.

## 27న నెక్లెస్ రోడ్‌లో 10కే మారథాన్.. మంత్రి తలసానికి ఆహ్వానం



హైదరాబాద్, మే23:సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉదయం 6 గంటలకు నెక్లెస్ రోడ్‌లో 5కే, 10కే మారథాన్ నిర్వహించనున్నారు. వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసన్ డే సందర్భంగా మారథాన్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సెమి అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, శ్రీని ఇన్‌ఫ్రా ఎండీ శ్రీనివాస్, సెమి ప్రతినిధులతో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా మారథాన్‌కు హాజరుకావాలని కోరుతూ ఆహ్వానపత్రికను అందజేశారు. 'ఎవ్రీ సెకండ్స్' థీమ్‌తో మారథాన్‌ను నిర్వహిస్తున్నామని, దీంతో పాటు సీపీఆర్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సుధాకర్ పేర్కొన్నారు.

తెలంగాణలోని పలు జిల్లాల నుంచి సుమారు 2వేల మంది డాక్టర్లు పాలుపంచుకుంటున్నట్లు వివరించారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణాలను కాపాడే ఎమర్జెన్సీ డాక్టర్ల అవగాహన కోసం మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అభినందించారు. అత్యవసర పరస్థితిల్లో ఎమర్జెన్సీ వైద్యుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ మేరకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సెమి నేషనల్ సెల్ అకాడమిక్ కౌన్సిల్ చైర్మన్ శ్రీనాథ్, నేషనల్ గవర్నస్ చైర్మన్ ఇమ్రాన్ సుభాన్, ఆర్గనైజింగ్ చైర్మన్ శర్వానన్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కిరణ్ వర్మ, కో ఆర్డినేటర్ తరుణ్ పాల్గొన్నారు.

## 196 మంది ఆర్టిజన్‌లకు ప్రభుత్వం ఊరట..తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయం : మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, మే23: విధుల నుంచి ప్రభుత్వం తొలగించిన ఆర్టిజన్లను తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ అబ్దుల్లా బలాల, ఆర్టిజన్ సంఘాల ప్రతినిధులు మంత్రిని, ట్రాన్స్‌కో, జెన్‌కో ఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డితో కలిసి చర్చలు జరిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాస్తవానికి ఔట్ సోర్సింగ్ పేరుతో విధులు నిర్వర్తిస్తున్న ఆర్టిజన్లను దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌మానవతా దృక్పథంతో క్రమబద్ధీకరించారని గుర్తు చేశారు. ఇటీవల సమ్మె పేరుతో విధులకు గైర్హాజరైన 196మంది ఆర్టిజన్లను మానవీయ కోణంలోనే తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు.అదే సమయలో ఈ తరహా సంఘటనలు పునరావృతం కాకూడదని మంత్రి ఆర్టిజన్ సంఘాల ప్రతినిధులకు సూచించారు. పునరావృతం అయితే ఉపేక్షింది లేదని ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు హెచ్చరించారు.

## ఆస్ట్రేలియ న్యూపర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ శ్రీపాల్ శ్రోడర్ తో సమావేశమైన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మే23:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2023 వ సంవత్సరం మే 23 వ తేదీ నాడు ఆస్ట్రేలియా లోని సిడ్ నీ లో ఆస్ట్రేలియన్ సూపర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ శ్రీ పాల్ శ్రోడర్ తో సమావేశమయ్యారు.ప్రపంచం లో విదేశీ పెట్టుబడుల కు అందరికీ తెగ నచ్చేటటువంటి ప్రముఖ ఆర్థిక వ్యవస్థల లో ఒకటి గా భారతదేశాని కి గల విశ్వసనీయత ను గురించి ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రకటించారు. దీనితో పాటు భారతదేశం తో భాగస్వామ్యం నెలకొల్పుకోవలసిందంటూ ఆస్ట్రేలియన్ సూపర్ ను ఆహ్వానించారు.ఆస్ట్రేలియన్ సూపర్ అనేది ఆస్ట్రేలియా లోని ఒక పెన్షన్ ఫండ్. దీని ప్రధాన కేంద్రం విక్టోరియా లోని మెల్ బర్న్ లో ఉంది.

# త్వరలో క్యాన్సర్ - కిల్లింగ్ డ్రగ్ రానుందా?.!

శరీరంలోని ఏభాగంలోనైన అపరిమిత, నియంత్రణ లేని కణ విభజనతో గడ్డలు/కణితి (ట్యూమర్స్) ఏర్పడి శరీరంలోని ఆరోగ్యకర కణజాలాన్ని నాశనం చేయడాన్ని క్యాన్సర్‌గా గుర్తిస్తారు. ట్యూమర్ ఏర్పడిన అవయవాన్ని బట్టి రొమ్ము, నోరు, క్లోమం, ఎముకలు, గొంతు, పేగులు, మెదడు, రక్తం లాంటి అనేక రకాలైనా క్యాన్సర్లు వస్తాయని మనకు తెలుసు. క్యాన్సర్ వ్యాధి ముదిరితే మరణమే శరణ్యం. తొలి దశలో గుర్తించి సరైన చికిత్స పొందితే కొంత వరకు నయం చేయవచ్చు.

ప్రతి పది మంది భారతీయుల్లో ఒక్కరికి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. ప్రతి ఏట భారత్‌లో 13 లక్షల మంది క్యాన్సర్ వ్యాధి బారినపడుతున్నారు. క్రియాశీలత కొరవడిన జీవనశైలి, పట్టణ కాలుష్యం, స్థూలకాయం, పొగాకు ఉత్పత్తుల దురలవాటు, ఆల్కహాల్ సేవించడం లాంటి కారణాలతో క్యాన్సర్ వ్యాధి సోకవచ్చు. రానున్న ఐదు ఏళ్లలో 12 శాతం క్యాన్సర్ రోగులు పెరగవచ్చని అంచనా. రొమ్ము, నోరు, గర్భాశయ క్యాన్సర్ రోగులు భారత్‌లో అధికంగా ఉన్నారు. ప్రతి పది క్యాన్సర్ కేసుల్లో కనీసం ఒక్కటైనా రొమ్ము క్యాన్సర్ కేసు ఉంటుంది. అన్ని రకాల క్యాన్సర్లలోకి పొగాకు సంబంధ క్యాన్సర్లు 27 శాతం ఉన్నట్లు తేలింది. ఇలాంటి ప్రాణాపాయ క్యాన్సర్ రోగులకు సరైన చికిత్స లేదు, ముదిరితే మరణం తప్పదనే అభిప్రాయంలో ఉన్న సమాజానికి త్వరలో క్యాన్సర్ వ్యాధికి ఔషధం రానుందన్న వార్త సంతోషాన్ని కలిగిస్తున్నది.

### క్యాన్సర్ చరిత్రలో తొలి ఔషధం:

ప్రపంచ వైద్య చరిత్రలో తొలిసారిగా 'క్యాన్సర్‌ను అంతం చేసే ఔషధం' క్రియాశీలతకు సంబంధించిన ప్రయోగాలు మానవ పరీక్షలలో ఆశించిన క్యాన్సర్ ట్యూమర్(గడ్డలు) వినాశన ఫలితాలను ప్రదర్శిస్తే, ఈ శుభవార్త సకల మానవాళికి, ముఖ్యంగా క్యాన్సర్ రోగులకు అనంత ఉపశమనాన్ని కలిగిస్తుందనటంలో అతిశయోక్తి లేదు. క్యాన్సర్ కణజాలాన్ని నాశనం చేయడానికి కొత్తగా రూపొందించిన ఈ ఔషధాన్ని సియఫ్33-హెచ్‌యన్‌ఐయస్'గా నామకరణం చేశారు. ఈ నూతన 'జెనెటికల్లీ ఇంజనీర్డ్ వైరస్' ఔషధాన్ని 'వ్యాక్సీనియా' అనబడే మరో పేరుతో కూడా పిలుస్తున్నాం. వ్యాక్సీనియా ఔషధ ప్రయోగంతో క్యాన్సర్ కణజాలం, ట్యూమర్లను నశింపజేయవచ్చని తేలింది. సియఫ్33-హెచ్‌యన్‌ఐయస్ ఔషధం జన్యుపరంగా రూపాంతరం చెందిన 'ఆంకోలైటిక్ వైరస్' క్యాన్సర్ కారక కణాలను మాత్రమే లక్ష్యంగా చేసుకొని, ఆరోగ్యకర కణాలకు నష్టం కలిగించకుండా, రోగకారక కణాలను నాశనం చేస్తూ వ్యాధి చికిత్సలో ఉపయోగపడుతుందని ఆశిస్తున్నారు. అమెరికాలో రూపొందించిన 'సియఫ్33-హెచ్‌యన్‌ఐయస్' ఔషధం 'కిమేరిక్ వ్యాక్సీనియా పోక్స్‌వైరస్'గా వర్గీకరించబడింది. ఈ నూతన ఆంకోలైటిక్ వైరస్ క్యాన్సర్ కణాలను నాశనం చేస్తూనే 'క్రోయాన్గసర్' కణజాలం పట్ల రోగ నిరోధకశక్తిని కూడా అదనంగా పెంపొందిస్తున్నదని తేలింది.

### ఔషధ పని తీరు:

సియఫ్33-హెచ్‌యన్‌ఐయస్ అనబడే 'మాడిఫైడ్ పోక్స్ వైరస్' క్యాన్సర్ కణాల్లోకి ప్రవేశించి మరికొన్ని కణాలుగా విభజించబడి, కణం పగిలి వేల నూతన వైరస్ కణాలను ఉత్పత్తి చేస్తూ, ఈ కొత్తగా ఏర్పడిన వైరస్ కణాలు ఆంటిజెన్స్‌గా పని చేస్తూ, సమీప క్యాన్సర్ కణాలపై సానుకూల దాడి చేస్తాయి. జంతువులపై సత్ఫలితాలను ఇచ్చిన సియఫ్33-హెచ్‌యన్‌ఐయస్ ఔషధం నేడు మానవ శరీరంలో ప్రయోగాలు చేయగల స్థితికి దారి తీసింది. 'యుయస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్' నుండి 2021 డిసెంబర్‌లోనే అనుమతులు పొందిన వ్యాక్సీనియా వైరస్ ఔషధం అమెరికా-ఆస్ట్రేలియా శాస్త్రజ్ఞుల సమన్వయంతో అభివృద్ధి చేయబడింది.

### ఎన్నటికి అందుబాటులోకి వస్తుంది:

మానవ ప్రయోగాల తొలిదశలో మాత్రమే ఉన్న ఈ ఔషధం క్రియాశీలత క్లినికల్ పరీక్షల్లో (క్యాన్సర్ కణాలను నాశనం చేయడంలో) సఫలం అయితే రానున్న రెండు ఏండ్లలో క్యాన్సర్ ఔషధం వాడటానికి మార్కెట్లోకి అందుబాటులోకి వస్తుందని ఆంకాలజిస్ట్స్ అంటున్నారు.

తొలి ప్రయత్నంగా 100 మంది క్యాన్సర్ రోగులపై ఈ ఔషధాన్ని ప్రయోగించి, తరువాత దశలో మరో రెండు ప్రామాణిక చికిత్స విధానాలను కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ ప్రయోగాలు సత్ఫలితాలను ఇచ్చిన యెడల నానున్న రెండేళ్ల తరువాత ఈ ఔషధం అందరికీ అందుబాటులోకి వస్తుందని గమనించాలి. ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో సియఫ్33 ఆశించిన ఫలితాలు ఇవ్వడంతో నేడు మానవ ప్రయోగ దశకు చేరుకోవడం ముదావహం. మానవ శరీరంలో ఔషధం క్రియాశీలంగా పని చేస్తూ, ఎలాంటి దుష్ప్రభావాలను కలిగించని యెడల, ఈ సియఫ్33 వైరస్‌ను 'ఫెంబ్రోలిజుమాబ్' వైరస్‌తో జత కలిపి క్రియాశీలతను పరీక్షిస్తారు.

### హెచ్‌యస్‌ఐయస్ వైరస్:

'హ్యూమన్ సోడియం ఐయొడైడ్ సింపోర్టర్ (హెచ్‌యస్‌ఐయస్)' అనబడే ప్రోటీన్‌ను ఉత్పత్తి చేసే సియఫ్33 వైరస్ యొక్క ఇమేజ్, మానిటర్, రిప్లికేషన్‌ను పరిశీలించడం జరుగుతుంది. ఈ ప్రయోగాల్లో తదుపరి దశలో రేడియోధార్మిక ఐయోడిన్‌ను ఉపయోగించి రొమ్ము క్యాన్సర్ కణాల్ని నాశనం చేయగల సామర్థ్యాన్ని గమనిస్తూ, ఔషధ పనితనాన్ని నిర్ధారణ చేస్తారు.

ఈ ప్రయోగాలు సఫలం అయితే ప్రపంచ మానవాళికి క్యాన్సర్ ఔషధం దొరికినట్లు అవుతుంది. అతి ప్రమాదకర క్యాన్సర్ వ్యాధిని నియంత్రించగల, నయం చేయగల ఔషధం తొందరగా అందుబాటులోకి రావాలని కోరుకుందాం. క్యాన్సర్ నివారణకు చక్కటి జీవనశైలిని అలవర్చుకుందాం. దిక్కుతోచక మరణం అంచున నిలబడిన క్యాన్సర్ రోగులకు కొత్త వ్యాక్సీన్ మందు ప్రాణాలు పోసే దివ్య ఔషధంగా ప్రజల ప్రాణాలు నిలుపుతుందనే ఆశాభావంతో శాస్త్రజ్ఞులకు అభినందనలు తెలియజేద్దాం, క్యాన్సర్ లేని లోకాన్ని నిర్మించుకుందాం.



- డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# అతిపెద్ద రుణ మేళాను ప్రారంభించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు



అమరావతి, మే23:భారత దేశంలోని ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్ లోని ఏలూరులో రుణ మేళాను నిర్వహించింది. వి.ప్రసన్న వెంకటేష్ ఐఏఎస్, కలెక్టర్ అండ్ జిల్లా మేజిస్ట్రేట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఆర్ బీ గ్రూప్ హెడ్ రాహుల్ శ్యామ్ శుక్లాతో కలిసి రుణ మేళాను ప్రారంభించారు. దాదాపు 3,500 మంది వినియోగదారులు ఏలూరులో నిర్వహించిన ఇటువంటి అతిపెద్ద రుణ మేళాకు హాజరయ్యారు. ఇందులో చిన్న, సన్నకారు రైతులు, ఎఫ్‌పీఓలు, అగ్రి స్టార్టప్‌లు, చిన్న అగ్రి వ్యవస్థాపకులు, ట్రాన్స్‌పోర్టర్లు, దుకాణదారులు, ఆరోగ్య సంరక్షణ సంస్థలు, ఎంఎస్ఎంఈ ప్రతినిధులు ఉన్నారు.

ఈసందర్భంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిఆర్‌బి గ్రూప్ హెడ్ రాహుల్ శ్యామ్ శుక్లా మేళాను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ కృష్ణా-గోదావరి ప్రాంత ఆర్థిక వృద్ధికి సహకరించేందుకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. నేడు, మన చిన్న వ్యాపారాలు, రైతులు అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థ సదుపాయాలు ఆశించిన స్థాయిలో అందుబాటులో లేవన్నారు. ఇప్పటికీ 6-7 కోట్ల మంది చిన్న రైతులు, దుకాణదారులు అనధికారిక వ్యవస్థ నుంచి అధిక ధరకు రుణాలను తీసుకుంటున్నారన్నారు. ఈ మేళా బ్యాంకింగ్‌ను అవసరమైన వారికి చేరవేసేందుకు, గ్రామీణ శ్రేయస్సుకు దోహదపడే దిశగా ఒక అడుగు ముందుకు వేస్తోందన్నారు. బ్యాంక్‌గా తమ పరిణామం మెట్రో నుంచి పట్టణానికి, ఆపై సెమీ అర్బన్ నుంచి గ్రామీణ భారతదేశానికి కొనసాగుతోందన్నారు. బ్యాంక్ 688 జిల్లాల్లోని ఎస్ఎంఈలకు రుణాలను అందిస్తూ, దాదాపు 2 లక్షల గ్రామాలకు అగ్రి ఫైనాన్స్ అందించేందుకు శ్రమిస్తోందని వివరించారు.

# గ్రామీణ రోడ్లకు మోక్షమెప్పుడో ..?

సంగారెడ్డి మే 23 (నేటి నిజం ప్రతినిధి) సంగారెడ్డి జిల్లాలో గ్రామపంచాయతీల రహదారులన్నీ పూర్తిగా చెడిపోయి పాదాచారులు కూడా నడవలేని దుస్థితిలో ఉన్నాయని చెప్పవచ్చు . ఏప్రిల్ మాసం 11న జరిగిన జెడ్పి సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు అన్ని రోడ్లకు నిధులు మంజూరైనాయని తెలియజేసినప్పటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే అన్నట్లు రోడ్ల పరిస్థితి దాపురించింది . జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలలో ఉన్న రోడ్లన్నీ తారు రోడ్లు వేయాలని లక్షలు కోట్లు అవసరమును బట్టి నిధులు మంజూరు చేసిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని రోడ్డు భవనాల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు రోడ్ల పనులు ప్రారంభించకపోవడం సోచనీయం. గ్రామ పంచాయతీలలో గల నాయకులు మా గ్రామానికి రోడ్డు మంజూరు అయిందని అది ఎందుకు వేయడం లేదని అధికారులను అడిగితే వారు చెప్పే జవాబు నిధులు మంజూరు కాలేదని లేదా టెండర్లు కాలేదని జవాబు చెబుతున్నారు. జహీరాబాద్ , నారాయణఖేడ్, ఆందోల్ సంగారెడ్డి నియోజకవర్గాలలో చాలా గ్రామపంచాయతీలకు ఉన్న రోడ్లు పూర్తిగా అధ్వాన స్థితిలో కొట్టొచ్చినట్టున్నాయి. గర్భిణీ స్త్రీలను రోగులను హాస్పిటల్స్ తీసుకువెళ్లాలన్నా ఆ రోడ్ల వెంబడి అంబులెన్సులు సరైన సమయానికి వచ్చే అవకాశాలు లేవని ప్రజలు వాపోతున్నారు. గ్రామపంచాయతీ గ్రామాల ప్రజలు తాండాలో ఉన్న పంచాయతీల ప్రజలు గ్రామాల నుండి మండల కేంద్రాలకు వెళ్లాలంటే ప్రజలు నరకయాతన పడవలసిందే . ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని రోడ్లన్నీ వేయాలని ఎక్కడ చూసినా ప్రజలు ఆవేదన చెందుతున్నారు . ప్రభుత్వము వెంటనే చర్యలు తీసుకుని బీటలు వారి గుంతల మయంగా మారిన రోడ్లన్నీ ప్రజల రాకపోకలకు వీలు కలిగేలా తారు రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆసుపత్రుల్లో నర్సుల సేవలు అపారం

### -తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ నర్సింగ్ విద్యుల్లత బాంధకవి
### -150 మంది నర్సులకు లేడి విత్ ల్యాంప్ అవార్డుల ప్రదానం



హైదరాబాద్ మే 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); ఇంటర్నేషనల్ నర్సస్ డే ఉత్సవాలలో భాగంగా ఆరోగ్యశాఖలో వెన్నెముక అయినటువంటి నర్సింగ్ వృత్తిని నర్సింగ్ సేవలను గుర్తించి వివిధ ఆస్పత్రుల లోని నర్సింగ్ అధికారుల నుండి ఎంచుకోబడిన 150 మంది నర్సులకు లేడి విత్ ల్యాంప్ అవార్డు 2023 లను ప్రదానం చేసారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరపున, నారాయణగూడ లోని రెడ్డి ఉమెన్స్ కాలేజీలో రెడ్ క్రాస్ హైదరాబాద్ బ్రాంచ్ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యుల్లత బాంధకవి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ నర్సింగ్ తెలంగాణ, కాకమొని శశి శ్రీ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డ్ తెలంగాణ, డా.విజయ భాస్కర్ గౌడ్ స్టేట్ ఐఆర్సిఎస్ సిపిఆర్ కన్వీనర్, శ్రీరామ్దాస్ తేజ ఏసీబీ ఆఫ్ సెంట్రల్ జోన్ హైదరాబాద్, నేరెళ్ల మాల్యాద్రి విశ్రాంత సుప్రీంకోర్టు జడ్జ్, ఏ పద్మజ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ కోటి, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ విజయ కుమారి, అజ్మీర్ విజయ సత్యనారాయణ గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరినిటెన్డెంట్ సరోజినీ దేవి కంటి ఆసుపత్రి, సుజాత రాథోడ్ గ్రేడ్ వన్ నర్సింగ్ సూపర్నెంట్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్,శ్రీ మహేందర్ రెడ్డి, శ్రీ సాయి చౌదరి కార్యక్రమ నిర్వాహకులుగా డాక్టర్ శ్రీదేవి, జ్యోతి యాదవ్, కల్పన దత్త గౌడ్ నర్సింగ్ ఆఫీసర్, వినయ్ కిషోర్ ఎం సి మెంబర్, వీరమని ఎంసి మెంబర్, స్వర్ణ రెడ్డి, డాక్టర్ రవికుమార్ డాక్టర్ హుస్సేన్ ,మజీద్ భాయ్ , మహేందర్ రెడ్డి , వెంకట్ పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా చిన్నారి టి.ప్రహర్షిత నాట్యనీ, ఆకట్టుకునీది హంసవేని చారిటబుల్ ట్రస్ట్ వారు నిర్వహించిన నృత్యానికి ఆకర్షితులై, ఉచిత వైద్య సేవలు అందిస్తామని డాక్టర్ విజయభాస్కర్ గౌడ్ హామీ ఇచ్చారు . అదేవిధంగా రెడ్ క్రాస్ కూడా వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పడం జరిగింది. ముఖ్యఅతిథి విద్యుల్లత మాట్లాడుతూ ఇంతమంది నర్సెన్ ని గుర్తించి అవార్డు బహుకరించినందుకుగాను రెడ్ క్రాస్ హైదరాబాదు బ్రాంచ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు .కోవిడ్ సమయంలో గాంధీ హాస్పిటల్ లోని వైద్య సిబ్బంది ని ఎన్నో రకాలుగా ఆదుకున్న గవర్నర్ ని, మన రాష్ట్ర సొసైటీని కొనియాడారు.

# పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు సామాజిక ఆర్థిక ముఖ చిత్రం పుస్తకం

మెదక్, మే23 (నేటినిజం ప్రతినిధి):పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు సామాజిక ఆర్థిక ముఖ చిత్రం పుస్తకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం తన ఛాంబర్ లో ప్రణాళిక శాఖ ముద్రించిన తెలంగాణా సామాజిక ఆర్థిక ముఖ చిత్రం-2023 పుస్తకాన్ని అదనపు కలెక్టర్ రమేష్, జిల్లా ముఖ్య ప్రణాళిఖాధికారి ఖాసీం తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పుస్తకం రాష్ట్ర సామాజిక ఆర్థిక స్థితిగతులను తెలపడమే గాక ప్రభుత్వ విధానాలు, పథకాలు, వివిధ కార్యక్రమాల సమా చారాన్ని, వాటి పనితీరును తెలుసుకోవచ్చున్నారు.అంతే గాక వివిధ విభాగాలలో రాష్ట్రం సాధించిన ప్రగతి, జవాబుదారీతనం, పారదర్శక తో బంగారు తెలంగాణ సాధన దిశగా భవిష్యత్ మార్గాలపై సమగ్ర అధ్యయనం చేయడానికి ఎంతో ఉపకరిస్తుందని అన్నారు. ఇంతటి చక్కటి సమాచారం తో రూపొందించిన పుస్తకం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకే గాక సామాజికవేత్తలు , మేధావులకు ఎంతో ఉపయాగకరం గా ఉంటుందని అన్నారు. 311 పేజీలు గల ఈ పుస్తకం ధర 150 రూపాయలని, కాగా జిల్లాలో పోటీ పరీక్షలకు సిద్దమవుతున్న 17 మంది ఎస్సి అభ్యర్థులకు ఉచితంగా అందజేశామనీ కలెక్టర్ తెలిపారు. ఇట్టి పుస్తకం కావలసిన వారు కలెక్టరేట్ లోని ముఖ్యప్రణాళిఖాధికారి కార్యాలయంలో కార్యాలయ పనివేళలందు 150 రూపాయలకు చెల్లించి పొందవచ్చని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక అధికారి విజయ శేఖర్ రెడ్డి, ఉప గణాంకాధికారి సురేష్, సహాయ గణాంకాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే నెల 17న జాతీయ జల పురస్కారాలు ప్రదానం

న్యూఢిల్లీ, మే22:కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖలోని జలవనరుల విభాగం, 4వ జాతీయ జల పురస్కారాల ప్రదానం వేడుకను వచ్చే నెల 17న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించనుంది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి శ్రీ జగదీప్ ధన్‌ఖర్‌ను ఆహ్వానించారు. ఉమ్మడి విజేతలు సహా 41 మంది 4వ జాతీయ జల పురస్కారాలు-2022కు ఎంపికయ్యారు. 'ఉత్తమ రాష్ట్రం', 'ఉత్తమ జిల్లా', 'ఉత్తమ గ్రామ పంచాయతీ', 'ఉత్తమ పట్టణ స్థానిక సంస్థ', 'ఉత్తమ పాఠశాల', 'ఉత్తమ మాధ్యమం', 'ఉత్తమ ప్రాంగణ వినియోగ సంస్థ', 'ఉత్తమ నీటి వినియోగదార్ల సంఘం', 'ఉత్తమ పరిశ్రమ', 'సీఎస్ఆర్ కార్యకలాపాల్లో ఉత్తమ పరిశ్రమ', 'ఉత్తమ ఎన్‌జీవో' వంటి 11 విభాగాల్లో అవార్డులు అందిస్తారు. విజేతలకు ప్రశంస పత్రం, జ్ఞాపిక, నగదు బహుమతి అందజేస్తారు. 1వ, 2వ, 3వ స్థానాల్లో నిలిచినవారికి వరుసగా రూ.2 లక్షలు, రూ.1.5 లక్షలు, రూ.1 లక్ష నగదు బహుమతి అందజేస్తారు.

జల వనరుల విభాగం కార్యదర్శి శ్రీ పంకజ్ కుమార్ అధ్యక్షతన, పురస్కారాల పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష జరిగింది. విజేతలు, ఆహ్వానితులు, వివిధ సంస్థల భాగస్వామ్యాన్ని మరింత బలంగా మార్చడానికి ఈ వేడుక ఒక సందర్భంగా మారుతుందని ఆయన చెప్పారు. నీటి వనరుల సంరక్షణ, నిర్వహణ కార్యకలాపాల్లో ప్రజల చొరవను ప్రోత్సహిస్తుందన్నారు.

పురస్కార గ్రహీతలు, వివిధ మంత్రిత్వ శాఖలు/విభాగాలు/ సంస్థలు/ రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రముఖులు/అధికారులు సహా సుమారు 1,500 మంది ఈ వేడుకలో పాల్గొంటారని భావిస్తున్నారు. అవార్డుల ప్రదానోత్సవానికి సంబంధించిన వివిధ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారుల నేతృత్వంలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. అవార్డులకు సంబంధించి మరిన్ని వివరాలను https://pib.gov.in/PressReleasePage.aspx?PRID=1848661 లింక్ ద్వారా చూడవచ్చు.

జలశక్తి మంత్రిత్వ శాఖ, నీటిని జాతీయ వనరుగా అభివృద్ధి చేయడం, పరిరక్షించడం, నిర్వహణ కోసం మార్గదర్శకాలు, కార్యక్రమాలను రూపొందించే బాధ్యత కలిగిన నోడల్ మంత్రిత్వ శాఖ. రాష్ట్రాలు, జిల్లాలు, పాఠశాలలు, ప్రభుత్వేతర సంస్థలు, గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలు, నీటి వినియోగదార్ల సంఘాలు, సంస్థలు, కార్పొరేట్ సంస్థలు సహా వివిధ వాటాదార్ల మద్దతు, చురుకైన భాగస్వామ్యం జల వనరుల సమర్థవంత నిర్వహణకు కీలకం. 'జల్ సమృద్ధ్ భారత్'ను సాధించడం కోసం, దేశంలోని రాష్ట్రాలు, జిల్లాలు, సంస్థలు, ప్రజలు మొదలైన వారు చేసిన ఆదర్శప్రాయమైన పనిని, ప్రయత్నాలను గుర్తించి ప్రోత్సహించడానికి జాతీయ జల పురస్కారాలను (ఎన్‌డబ్ల్యూఏ) ప్రారంభించారు.

2018 సంవత్సరంలో, మొదటి విడత జాతీయ జల పురస్కారాలు ప్రకటించారు. 14 విభాగాల్లో 82 మంది విజేతలకు 2019 ఫిబ్రవరి 25న దిల్లీలో అవార్డులు ప్రదానం చేశారు. ఆ తర్వాత, 2019లో 2వ జాతీయ జల పురస్కారాలను ప్రకటించారు. 2020 నవంబర్ 11-12 తేదీల్లో జరిగిన కార్యక్రమంలో, 16 విభాగాల్లో 98 మంది విజేతలను భారత ఉపరాష్ట్రపతి సత్కరించారు. 3వ జాతీయ జల పురస్కారాల ప్రదానం కార్యక్రమం 2022 మార్చి 29న నిర్వహించారు. 11 విభాగాల్లో 57 మంది విజేతలకు అవార్డులు అందించి భారత రాష్ట్రపతి సత్కరించారు. వచ్చే నెల 17న విజ్ఞాన్ భవన్‌లో ప్రదానం చేయబోయేవి 4వ జాతీయ జల పురస్కారాలు.

# ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం నూతన కార్యవర్గం



న్యూఢిల్లీ, మే23: ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం తృతీయ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు మంగళవారం గుంటూరు అన్నమయ్య గ్రంథాలయంలో నిర్వహించినట్లు అధ్యక్షుడు సోమేపల్లి వెంకట సుబ్బయ్య, కార్యదర్శి ఎస్.ఎమ్.సుభాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఎన్నిక కాబడిన కార్యవర్గంలో అధ్యక్షుడిగా సోమేపల్లి వెంకట సుబ్బయ్య (గుంటూరు జిల్లా), ప్రధాన కార్యదర్శిగా చలపాక ప్రకాష్ (ఎన్టీఆర్ జిల్లా), కోశాధికారిగా నానా (నారిశెట్టి సత్యనారాయణ) (గుంటూరుజిల్లా)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. ఉపాధ్యక్షులుగా డా।। వెలువోలు నాగరాజ్యలక్ష్మి (గుంటూరు), పొన్నూరి వేంకట శ్రీనివాసులు (ప్రకాశం జిల్లా), పి.హరికృష్ణారెడ్డి (చిత్తూరు), ఎ.జయప్రకాష్ (నెల్లూరు జిల్లా), ఎస్.ఆర్.పృథ్వీ, (తూ.గో. జిల్లా), రాధేయ (అనంతపురం), మాధవీ సనారా (అనకాపల్లి జిల్లా), బొమ్మ ఉమామహేశ్వరరెడ్డి (గుంటూరు) ఎన్నికయ్యారని తెలిపారు. కార్యదర్శులుగా ఎస్.ఎమ్.సుభాని (గుంటూరు జిల్లా), కె.జె.రమేష్ (పల్నాడు జిల్లా), సి.ఎన్.చంద్రేఖర్ (చిత్తూరు), బుర్రి కుమార్ రాజా (శ్రీకాకుళం), పి.లక్ష్మణరావు (విజయనగరం), శర్మ సిహెచ్ (ఎన్టీఆర్ జిల్లా) ఎన్నికయ్యారని, కార్యవర్గ సభ్యులుగా కోపూరి పుష్పాదేవి (ఎన్టీఆర్ జిల్లా), ఎమ్.ఆర్.వి. సత్యనారాయణమూర్తి (ప।।గో।। జిల్లా), ఎన్.కాశీంబి (గుంటూరు జిల్లా), సలహా మండలి సభ్యులుగా అడిగోపుల వెంకటరత్నం (చిత్తూరు), కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ (ఎన్టీఆర్ జిల్లా), గబ్బిట దుర్గాప్రసాద్ (కృష్ణా) ఎన్నికైయ్యారని తెలిపారు. వీరు 2023-2026 సంవత్సరాలకు గాను తమ పదవీ బాధ్యతలు నిర్వర్తిసారని ప్రకటనలో తెలియజేశారు.




# ఎన్.యు.జే. (ఐ) జాతీయ ఉపాధ్యక్షుడిగా పురుషోత్తం నారగౌని

హైదరాబ్నాద్ మే 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఐ) జాతీయ కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా సీనియర్ పాత్రికేయుడు పురుషోత్తం నారగౌని నియమితులయ్యారు. ఇటీవల ఒడిస్సా రాష్ట్రంలోని జజ్బూర్ కేంద్రంగా నిర్వహించబడిన యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఈ నియామకం జరిగింది. దక్షిణ భారతదేశంలోని తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ తమిళనాడు కర్ణాటక కేరళ రాష్ట్రాల యూనియన్ కార్యక్రమాల పర్యవేక్షణ తదితర బాధ్యతలు నిర్వహిస్తారు. తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, జాప్ ఉపాధ్యక్షుడిగా, జాప్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా, తెలంగాణ జర్నలిస్టు జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ గా గతంలో ఈయన పని చేశారు. అలాగే ఎన్. యు . జే (ఐ ) జాతీయ కార్యవర్గ సభ్యులుగా సీనియర్ పాత్రికేయులు సిల్వేరి శ్రీశైలం, బుచ్చి రాములు, రాజన్న నియమితులయ్యారు. దక్షిణ భారతదేశంలో ఎన్ యు జె (ఐ) నీ బలోపేతం చేస్తానని, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జర్నలిస్టులకు రావలసిన అన్ని వసతులను సౌకర్యాలను అందేలా తగు ప్రణాళికలు రూపొందించి ఉద్యమ నిర్మాణం చేస్తానని పురుషోత్తం నారగౌని అన్నారు.

# పువ్వులు అమ్మొద్దంటూ దాడులు.. న్యాయం చేయాలన్న రైతులు




నిజామాబాద్, మే23:ఆరుగాలం పాటు శ్రమించి ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి చేనులో పెంచిన పువ్వులను విక్రయించకుండా దౌర్జన్యం చేస్తూ.. భయ భ్రాంతులకు గురి చేస్తున్న పూల వ్యాపారులపై చర్యలు తీసుకొని.. న్యాయం చేయాలని రైతులు కోరారు. పండించిన పంటనే కాకుండా చివరికి పూలు అమ్ముకునే రైతులను కూడా దళారులు వదిలి పెట్టడం లేదు అనడానికి నిజామాబాద్ నగరంలో జరిగిన ఈ ఘటన నిదర్శనం? నిజామాబాద్ లోని రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతం లో పువ్వులు అమ్మొద్దంటూ రైతులపై దళారి పూల వ్యాపారుల దౌర్జన్యం నశించాలని రైతులు మాట్లాడారు. మహారాష్ట్ర ఉమ్రి ప్రాంతంలో సొంత చేను లో ఆరుగాలం పాటు శ్రమించి పెంచిన పువ్వులను విక్రయించడానికి నిజామాబాద్ నగరానికి రైలు మార్గాన ప్రతిరోజు నిజామాబాద్ నగరానికి వస్తామని తెలిపారు.కాగా కొందరు దళారులు, పూల వ్యాపారులు సిండికేట్ గా మారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొ న్నారు. గత మూడు రోజుల క్రితం రైల్వే స్టేషన్ ప్రాంతంలో పువ్వులు అమ్ముకునే రైతులపై.. పూల వ్యాపారులు దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేస్తు న్నారని ఆరోపించారు. దళారులను నమ్ముకుండా నేరు గా కష్టపడి పెంచిన పువ్వు లను విక్రయించే హక్కు రైతుల కు లేదా అని పేర్కొన్నారు. పూల వ్యాపారుల దౌర్జన్యం ఏమిటని ప్రశ్నించారు. అంతేకా కుండా ట్రాఫిక్ పోలీసుల ద్వారా తమపై ఒత్తిడి తీసుకువస్తు న్నారని ఆరోపించారు. ఇప్పటి కైనా ప్రభుత్వం, పోలీసులు వెంటనే విచారణ చేపట్టి మాపై దౌర్జన్యం చేస్తూ భయభ్రాం తులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని రైతులు కోరారు. పూల వ్యాపారుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

# రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్ళు చేయాలి

మెదక్, మే23 (నేటినిజం ప్రతినిధి ):కొల్చారం మండలం పోతంశెట్‌పల్లి సెంటర్‌ను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారిణి ఆశాకుమారిమెదక్? జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేసే సమయంలో చెత్త, పొల్లు లేకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని మెదక్? జిల్లా వ్యవసాయాధికారిణి ఆశాకుమారి అన్నారు. ఈ మేరకు మంగళవారం కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్?పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఎంత కొనుగోలు జరిగింది ? ప్రస్తుతం ఇంకా ఎంత రెడీగా ఉంది ? ఇంకా ఎంత కొనుగోలు చేయాలనే వివరాలతో పాటు గోనెసంచులు, హమాలీలకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయనే వివరాలను వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ విషయంలో రైతులకు ఏమైనా ఇబ్బందులు వస్తే తమకు తెలియజేయాల్సిందిగా జిల్లా వ్యవసాయాధికారిణి ఆశాకుమారి అక్కడ ఉన్న రైతులకు తెలిపారు. ధాన్యం త్వరగా రైస్?మిల్లులకు చేరేలా అవసమైన ఏర్పాట్లు చేశామని... రైతులు ధాన్యంలో చెత్త, పొల్లు లేకుండా తేమ శాతం 17 కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి ప్రతిభ, ఐకేపీ సెంటర్? ఇంఛార్జి యాదగిరి తదితరులు ఉన్నారు.

# తెలంగాణలో రైతు, ప్రజా సంక్షేమ ప్రభుత్వం : మంత్రి కొప్పుల

జగిత్యాల, మే23: తెలంగాణ ప్రభుత్వం గడిచిన 10 సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశంలోని మరే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు చేపట్టలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ వెల్లడించారు. మంగళవారం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం గాదెపల్లి, తీగలధర్మారం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు, ప్రజా సంక్షేమ ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో కొనసాగుతుందని వెల్లడించారు.

రైతులకు సాగునీరు, రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంట్, కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, రూ. 2016 పెన్షన్, రెసిడెన్షి యల్ స్కూళ్లలో పిల్లలకు సన్నబియ్యం తో పోషకాహార భోజనం లాంటి పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్నాయా అని ప్రశ్నించారు.

నూతన వ్యవసాయ చట్టం వల్ల రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని మంత్రి పేర్కొన్నారు.

రైతాంగాన్ని అన్ని ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకువస్తే రాష్ట్రభవిష్యత్ మారిపోతుందన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ రైతులకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. నకిలీ విత్తనాలు, గుర్తింపు లేని పురుగుల మందులు విక్రయిస్తున్న వ్యాపారస్తుల పై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు.

వల్లె ప్రగతితో గ్రామాల



రూపురేఖలు మారిపోయాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ బృహత్తర కార్యక్రమాలు చేపడుతుంటే వాటిని అడ్డుకోవడానికి ప్రతిపక్షాలు చేస్తున్న కుటిల యత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

# రూల్స్‌కు మించి తరుగు తీయొద్దు.. మిల్లర్లకు సీపీ స్వీట్ వార్నింగ్

వరంగల్, మే23:వడ్ల కాంటా విషయంలో ప్రభుత్వ నిబంధనలకు మించి తరుగు తీస్తే, సదరు రైస్ మిల్లులపై కఠిన చర్యలుంటాయని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. ధాన్యం తూకం అంశానికి సంబంధించి రైస్ మిల్ అసోసియెషన్ సభ్యులతో ఇవ్వాల (మంగళవారం) ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్, జనగాం, హనుమకొండ జిల్లాలకు చెందిన రైస్ మిల్ అసోసియేషన్ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా తూకం విషయంలో రైస్ మిల్ యాజమాన్యం నిర్వహిస్తున్న తీరుపై చర్చించారు.

అనంతరం.. సీపీ రంగనాథ్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల అంశాన్ని దృష్టిలో పెట్టుకొని ధాన్యం తూకం విషయంలో పోలీస్ జోక్యం కలిగించుకోవడం జరుగుతోందన్నారు. కొద్ది రోజులుగా ఐ.కె.పి కేంద్రాల నుండి మిల్లులకు తరలిపోయిన ధాన్యం తూకం విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, మిల్లు యాజమాన్యం తప్పుడు విధానాలతో ఎక్కువ మొత్తంలో తరుగు తీయడం సరికాదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి తరుగు తీయాలని, రైస్ మిల్లు యాజమాన్యం పారదర్శకంగా ఉండాలన్నారు. మిల్లుల్లో జరుగుతున్న కార్యకలపాలపై రైతుల నుండి ఫొటోలు, వీడియో వంటి దృష్యాలు అందుతున్నాయని సీపీ తెలియజేసారు. అందుకని ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టమున్నట్టు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు.

# పువ్వాడకు పూనకలు లోడింగ్..!

- ఖమ్మంలో పొంగులేటి ఆత్మీయ సమ్మేళనంతో ఆందోళన
- అందుకే ఫ్రస్ట్రేషన్ తో ఏమేమో మాట్లాడుతున్నాడు
- పార్టీలో ఉన్నప్పుడు అక్రమ సంపాదనపై ఎందుకు మాట్లాడలేదు
- నీ పక్కన ఉన్న కట్టప్పల గురించి ఆలోచించుకో
- విలేకరుల సమావేశంలో పొంగులేటి అనుచరులు మువ్వా,స్వర్ణకుమారి,నగేశ్ యాదవ్



ఖమ్మం, మే23: (నేటి నిజం ప్రతినిధి): ఖమ్మంలో పొంగులేటి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం చూసి పువ్వాడ అజయ్ కుమార్ కు పూనకం వచ్చిందని,వచ్చిన జనసందోహాన్ని చూసి తట్టుకోలేక ఫ్రస్ట్రేషన్లో ఏమేమో మాట్లాడుతున్నాడని పొంగులేటి అనుచరుడు మువ్వా విజయబాబు ఫైర్ అయ్యాడు. మంగళవారం శ్రీనివాసరెడ్డి క్యాంపు ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మువ్వా మాట్లాడుతూ.. పొంగులేటి అడగడం వల్లే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వచ్చాయని,ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యతను మాత్రం పొంగులేటి తీసుకుంటాడని తెలిపారు. 30 ఏళ్ల పాటు కాంట్రాక్టర్ గా కష్టపడ్డ పొంగులేటి ఇప్పుడు ఈ స్థాయికి వచ్చాడని...కూనవరంలో దేంతో మీ ప్రస్థానం మొదలైంది.. ఖమ్మంలో కోట్లకు ఎలా పడగలెత్తారో చెప్పాల్సిన అవసరం మీకుందని పువ్వాడను ప్రశ్నించారు.పొంగులేటి అక్రమంగా సంపాదించాడని ఇప్పుడు మాట్లాడుతున్న మీరు.. మీ పార్టీలో ఉన్నప్పుడు ఈ విషయం గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. కొత్త బస్టాండ్ నిర్మాణ వ్యయాలేంటి?, గోళ్లపాడు ఛానల్ ద్వారా దండుకున్నదెంత? అందరికీ తెలుసన్నారు. బైరటీస్ అక్రమ వ్యవహారంపై త్వరలో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. డీసీసీబీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని అన్నింటికి లెక్కలున్నాయని వెల్లడించారు.ఈ విషయమై అష్టలక్ష్మీ గుడి దగ్గర ప్రమాణం చేయడానికి సిద్ధం..నీవు సిద్ధమా అంటూ పువ్వాడకు సవాల్ విసిరారు.పార్టీ ఆఫీసులో నీ ఫొటో తీసేశారని,మొదట నీ పక్కన ఉన్న కట్టప్పల గురించి తెలుసుకోవాలని హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలో నీ ఓటమి తప్పదు గుర్తుంచుకో అంటూ మువ్వా ఫైర్ అయ్యాడు. మద్దినేని బేబీ స్వర్ణకుమారి మాట్లాడుతూ... పువ్వాడ నాగేశ్వరరావు పేరు చెడగొట్టొద్దని మంత్రి అజయ్ కుమార్ కు సూచించారు.శ్రీనివాసరెడ్డిపై ఆరోపణలు మానుకొని ప్రజాక్షేత్రంలో తేల్చుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్పొరేటర్ దొడ్డా నగేశ్ యాదవ్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఖమ్మంలో పువ్వాడపై పోటీ చేసి గెలిచే బచ్చాను నేనే అని,అనవసరమైన మాటలతో కాలయాపన చేయకుండా పోటీకి సిద్ధంగా ఉండాలన్నారు.ఈ విలేకరుల సమావేశంలో మందడపు తిరుమల రావు, బోడా శ్రావణ్, మియాభాయ్, దుంపల రవికుమార్, మందడపు నాగేశ్వరరావు, దుర్గా, నాగరాజు యాదవ్ తదితరులు ఉన్నారు.

# పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖను పునర్వ్యవస్థీకరించడం పట్ల హర్షం

మెదక్, మే23 (నేటినిజం ప్రతినిధి):పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖను పునర్వ్యవస్థీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీరింగ్ విభాగం తరపున కార్యనిర్వాహక ఇంజనీరు సత్యనారాయణ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత సాగు నీరు, విద్యుత్ రంగాలు మెరుగుపడి వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు అభివృద్ధి చెందాయని, తద్వారా వాహనాల రాకపోకలతో పంచాయత్ రాజ్ రోడ్లను బలోపేతం చేయడంతో పాటు ఈ శాఖ ద్వారా అమలు పరుస్తున్న వివిధ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయుటకు చేయవలసి ఉందని గుర్తించిన ప్రభుత్వం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖను పునర్వ్యవస్థీకరిస్తూ (నేడు) మంగళవారం జి.ఓ. 18 విడుదల చేసిందని తెలిపారు. ఇట్టి ఉత్తర్వుల్లో 4 కొత్త టెరిటోరియల్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయాలు, 12 కొత్త సర్కిళ్లు, 11 కొత్త డివిజన్లు,60 కొత్త సబ్ డివిజన్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొందని ఆయన తెలిపారు. పంచాయత్ రాజ్ ఇంజనీరింగ్ శాఖ బలోపేతానికి పునర్వ్యవస్థీకరణ చేసిన రాష్ట్ర ముఖ్యమంతి కేసి.ఆర్. కు ఇందుకు సహకరించిన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, హరీష్ రావు, కె.టి.రామా రావు, అధికారులు శాంతి కుమారి, రామకృష్ణా రావు, సందీప్ సుల్తానియా, స్మిత సబర్వాల్, ఇంజనీర్ ఇన్ చీఫ్ సంజీవరావు లకు జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీరింగ్ విభాగం తరపున సత్యనారాయణ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# శిక్షణా కలెక్టర్‌గా మయాంక్ సింగ్




ఖమ్మం, మే23: (నేటినిజం ప్రతినిధి): శిక్షణా కలెక్టర్ గా ఖమ్మం జిల్లాలో 2022 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన మయాంక్ సింగ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఐడిఓసిలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ను మర్యాదపూర్వకంగా ఆయన కలిశారు. మధ్యప్రదేశ్, భోపాల్ కు చెందిన మయాంక్ సింగ్ యూపీఎస్సీలో 380 ర్యాంక్ సాధించారు.

# కులవృత్తులు చేసుకునే బీసీలందరికి లక్ష రూపాయలు కేటాయించాలి

హైదరాబాద్ మే 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులు చేసుకునే వాళ్ళకి లక్ష రూపాయలు కేటాయిస్తానని పెర్కొనడం హర్షనీయమని,ఐతే గతంలో5 లక్షల 77 వేల మందికి సబ్సిడీ రుణాలు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు 40 వేల మందికి మాత్రమే కేటాయించింది మిగతా ఐదు లక్షల 37 వేల మందికి ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి రుణాలు కేటాయించలేదని మహిళా నాయకురాలు మట్ట జయంతి పేర్కొన్నారు. ఇప్పుడు ఇచ్చే లక్ష రూపాయలు రుణాలు కూడా ఇచ్చే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందా లేక ఎలక్షన్ల సమయం కాబట్టి ఇలాంటిది ప్రభుత్వం నిర్ణయించిందా లేక ఎలక్షన్లో ఓటర్లని మభ్య పెట్టాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుందా అన్న అనుమానాన్ని వ్యక్తం చేసారు. నిజంగా బీసీల పట్ల గౌరవం ఉంటే వెంటనే ఈ లక్ష రూపాయలు అన్ని కులవృత్తులు చేసుకునే బీసీలకు వెంటనే కేటాయించాలని ఆమె డిమాండ్ చేసారు.

# మోదీ సర్కార్‌పై ఆప్, టీఎంసీ ఫైర్



న్యూఢిల్లీ, మే23:ఢిల్లీ ప్రభుత్వ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై పట్టు కోసం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కేంద్రంపై పోరాటాన్ని తీవ్రతరం చేసింది. ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా విపక్షాల మద్దతు కూడగడుతోంది. ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను గుంజుకుంటూ కేంద్రం జారీ చేసిన ఆర్డినెన్స్‌పై పోరును జాతి పోరాటంగా అరవింద్ కేజ్రీవాల్ అభివర్ణించారు.

తమ బిల్లులన్నీ రాజ్‌భవన్‌లో మగ్గుతున్నాయని తమిళనాడు సీఎం చెబుతున్నారని, ఇది కేవలం తమ పోరాటమే కాదని ఇది దేశవ్యాప్త పోరాటమని స్పష్టం చేశారు. ఢిల్లీ పోలీసులు మనీష్ సిసోడియాను ఎలా ట్రీట్ చేశారో మీరంతా చూశారని అన్నారు. ఢిల్లీలో బ్యూరోక్రాట్‌ల పోస్టింగ్, బదిలీలపై నియంత్రణ కోసం కేంద్రం జారీ చేసిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా విపక్షాల మద్దతు కూడగట్టేందుకు కేజ్రీవాల్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు.

అధికారుల బదిలీలు, పోస్టింగ్‌ల కోసం కేంద్రం నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీస్ అథారిటీ ఏర్పాటు దిశగా ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆప్ బీజేపీయేతర పార్టీల మద్దతును కోరింది. ఇది విపక్షాలకు అగ్నిపరీక్ష సమయమని దేశ ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడాలనుకునే పార్టీలు ముందుకు రావాలని ఆప్ పిలుపు ఇచ్చింది. ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను కత్తిరిస్తూ కేంద్రం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను టీఎంసీ కూడా వ్యతిరేకించింది. కేంద్రం ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తోందని దుయ్యబట్టింది.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం.. మేయర్ నీతూ కిరణ్



నిజామాబాద్, మే23:: ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని నగర మేయర్ దండు నీతూ కిరణ్ అన్నారు. మంగళవారం నిజామాబాద్ నగరంలోని నాల్కల్ రోడ్డు వద్ద గల మేయర్ క్యాంప్ కార్యాలయంలో నిజామాబాదు నగర మేయర్ దండు నీతూ కిరణ్ ని, స్టేట్ ఏసీ ఎస్ఎం కన్సల్టెంట్ సురేష్, డి ఎం హెచ్ ఓ సుదర్శనం మర్యాద పూర్వకంగా కలిసారు. టీబీ నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి మేయర్ సహకారం కావాలని కోరారు.

టీబీ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందేలా యాక్షన్ ప్లాన్ రూపొందించమని డీఎంహెచ్వో కు మేయర్ సూచించారు. టీబీ పై అవగాహనా పెంచే ఏ కార్యక్రమానికైనా తాను హాజరవుతానని తెలిపారు. దేశంలోనే నిజామాబాదు జిల్లాకు టీబీ నియంత్రణలో పేరు వచ్చిందని, క్షయ విభాగం ఉద్యోగులు తమ సేవలు ఇలాగే కొనసాగిస్తూ నిజామాబాదును టీబీ రహిత జిల్లాగా మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డాక్టర్ యం.సుదర్శనం, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవి, డీపీపీఎం నరేష్ పాల్గొన్నారు.

# ఈ నెల 25న దిశ కమిటీ సమావేశము

ఖమ్మం, మే23: (నేటినిజం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వ పథకముల జిల్లా అభివృద్ధి, సమన్వయ మరియు పర్యవేక్షణ(దిశ)కమిటీ సమావేశము ఈనెల 25న గురువారం ఉదయం : 10.00 గం.లకు, ఐ.డి.ఓ.సి. (సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయము) సమావేశ మందిరంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు (లోక్‌సభ),చైర్మన్, దిశా కమిటి అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ మరియు సభ్య కార్యదర్శి, దిశా కమిటి వి.పి.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి సమావేశమునకు సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు సమీక్ష సమావేశానికి సంబంధించిన సమాచారంతో సకాలములో హాజరుకావలసినదిగా ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


కంచరాన భుజంగరావు
కవితా సంపుటి

"నీటిగింజల పంట"
పుస్తకావిష్కరణ సభ

తేది : 27 మే 2023 ఉదయం 9 గం. నుండి మధ్యాహ్నం 1 గం. వరకు
వేదిక : హోటల్ గ్రాండ్, రామలక్ష్మణ జంక్షన్, శ్రీకాకుళం




ఆహ్వానం : లండ సాంబమూర్తి
సభాధ్యక్షులు : అట్టాడ అప్పల్నాయుడు
ఆవిష్కర్త : కె శివారెడ్డి
ముఖ్య అతిథి : జి లక్ష్మీనరసయ్య
ఆత్మీయ అతిథి : గంటేడ గౌరునాయుడు
గౌరవ అతిథి : డా॥ ఎస్. తిరుమల చైతన్య
విశిష్ట అతిథి : కొప్పల భానుమూర్తి

పుస్తక సమీక్షకులు :
శ్రీరామ్ పుప్పాల
అనిల్ డ్యానీ

ఆప్తవాక్యాలు : వివిధ ప్రాంతాల సాహితీమిత్రులు
కవి స్పందన : కంచరాన భుజంగరావు
పుస్తక బహూకరణ : చింతాడ తిరుమలరావు
వందన సమర్పణ : దాసరి రామచంద్రరావు

సిక్కోలు బుక్ ట్రస్ట్
శ్రీకాకుళ సాహితి

# రాష్ట్ర క్రీడా ప్రాంగణాల్లో యువ జాతర

**-నల్గొండ జిల్లా కేంద్రంలో సీఎం కప్ -2023 పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్**




నల్లగొండ మే 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); నల్గొండ జిల్లా కేంద్రంలోనీ మేకల అభినవ్ స్టేడియంలో జరుగుతున్న జిల్లా స్థాయి సీఎం కప్ -2023 పోటీల సందర్భంగా స్థానిక శాసన సభ్యులు కంచెర్ల భూపాల్ రెడ్డి గారితో కలసి తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ క్రీడా పోటీలు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మైదానంలో వివిధ క్రీడా పోటీలలో తలపడుతున్న క్రీడా జట్లను పరిచయం చేసుకున్నారు. అనంతరం వాలిబాల్ తో పాటు వివిధ క్రీడలు ఆడుతున్న క్రీడాకారుల తో కలసి, ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తో పాటు ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. తదనంతరం, ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, గ్రంధాలయం చైర్మన్ రెగట్టే మల్లికార్జున్ రెడ్డి గార్లో తో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు... ఈ సందర్బంగా మాట్లాడుతూ.. రాష్ట్రము లో సీఎం కప్ కి అద్భుతమైన స్పందన వస్తుంది శాట్స్ ఆధ్వర్యంలో 617 మండల కేంద్రాలలో నాలుగు న్నర లక్షల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్రము లో గడచిన 30ఏళ్ళలో అతిపెద్ద క్రీడా సంబురమన్నారు. ఈ నెల 22 నుండి 24 తేదీ వరకు జరిగే జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలలో లక్షన్నర మంది 15నుండి 35 ఏళ్ళు గల యువ క్రీడాకారులు పాల్గొంటున్నారు. రాష్ట్రము లో ఉన్న క్రీడ ప్రాంగణాలు అన్నీ నవతరం తో కళకళ లాడుతున్నాయి. రాష్ట్ర ముఖ్య మంత్రి గారి దూరదృష్టి తో గ్రామీణ స్థాయి నుండి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యం గా క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. దేశంలోనే సీఎం కెసిఆర్ గారు ఎక్కడ లేని విధంగా 17వేల క్రీడా ప్రాంగనాలను నిర్మించారు. క్రీడా ప్రాంగణాలను యువత కేర్ టెకర్లుగా మారి వాటిని సంరక్షించుకోవాలన్నారు. యువత కుటుంబలతో కలసి క్రీడ ప్రాంగణంలో గడిపి ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని పెంపోందించుకోవాలి. తెలంగాణ ప్రభుత్వ ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయి లో నిజామాబాదు కి చెందిన నిఖత్ జరిన్, అదే విధంగా ఈషా సింగ్, కొత్త గూడెం కి చెందిన క్రికెటర్ త్రిష, మొన్నటికి మొన్న చెస్ లో గ్రాండ్ మాస్టర్ గా నిలిచిన ఆదిత్య లాంటి వారు అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా క్రిడాకారులకు జూబ్లీహిల్స్ లాంటి ప్రాంతాలలో ఖరిదైనా 600గజాల ఇళ్ల స్థలాలు, అత్యున్నత నగదు పురస్కారాలు ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సాహిస్తున్నారు. వ్యవసాయ, సాగు, అన్నీ రకాల రంగాలను దేశానికి గౌరవ సీఎం గారు మోడల్ గా నిలపారు.. భవిష్యత్తులో కూడ తెలంగాణ ప్రభుత్వం క్రిడలను తెలంగాణ మోడల్ గా నిలవబోతుంది. ఈ కార్యక్రమం లో నల్గొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ రెగట్టే మల్లికార్జున్ రెడ్డి, డివైఎస్ మహమ్మద్ మగ్భుల్, స్థానిక ప్రజా ప్రతినిధులు, వేలాది మంది క్రీడాకారులు, పిఈటిలు, కోచ్ లు పాల్గొన్నారు

# వైఎస్ ఆర్ కాంగ్రెస్‌కి నాలుగేళ్లు.. కేక్ కట్ చేసిన ఎంపీ డాక్టర్ గురుమూర్తి

తిరుపతి, మే23: వైఎస్ఆర్ కాంగ్రెస్ విజయం సాధించి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంపీ గురుమూర్తి కార్యాలయంలో నాయకులు.. కార్యకర్తలు కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ కార్యకర్తలకు ఎంపీ డాక్టర్ గురుమూర్తి కార్యాలయంలో స్వీట్స్ వంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్మోహన్ రెడ్డికి తిరుగులేని విజయాన్ని అందించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు.. కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజా రంజక పాలన అందిస్తున్న జగన్ మళ్ళీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని 2024లో కూడా గతంలో కంటే ఎక్కువ మెజార్టీ రావడం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

ప్రభుత్వ మిగిలిన సమస్యలను తెలుసుకునేందుకు కూడా గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందించినటువంటి సంక్షేమం అభివృద్ధి తెలియజేయడంతో పాటు సమస్యలు ఏదైనా ఉంటే పరిష్కరించేందుకు ప్రజల వద్దకే వెళ్లి తెలుసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ప్రజలు చల్లని దీవెనలతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తిరిగి ప్రజలు పట్టడం కడతారని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పడిన ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకే అండగా ఉండి విజయానికి సైనికుల్లాగా నడుము బిగిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంకా బడులకు చేరని బుక్స్.. మరో 20 రోజుల్లో స్కూల్స్.. పునఃప్రారంభం!

హైదరాబాద్, మే23: పాఠశాలలు పునఃప్రారంభమయ్యే రోజే పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసేలా విద్యాశాఖ అధికారులు లక్ష్యం పెట్టుకున్నప్పటికీ ఆ దిశగా అడుగులు మాత్రం పడడంలేదు. మరో 20 రోజుల్లో పాఠశాలలు తెరుచుకోనున్నాయి. అయినా ఇప్పటి వరకూ జిల్లాలకు ఉచిత పాఠ్యపుస్తకాలు ఇంకా చేరనేలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు కేవలం 62 శాతం పాఠ్యపుస్తకాలు మాత్రమే జిల్లాలకు చేరాయి. మిగితావి ఈ 20 రోజుల్లో చేరవేయాల్సి ఉంటుంది. అవి జిల్లాలకు చేరాలి.. అక్కడి నుంచి మండలాలకు? పాఠశాలలకు చేరాల్సి ఉంది. ఇదంతా జరగాలంటే ఎక్కువ సమయమే పట్టనుంది. ఒకవేళ పాఠశాలలు పునఃప్రారంభమయ్యేనాటికి పుస్తకాలు చేరకుంటే పాత పుస్తకాలతోనే విద్యార్థులు సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే పాఠశాలలకు పుస్తకాలు చేరడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కొన్ని జిల్లాలకు పుస్తకాల రవాణా కోసం ఇచ్చే బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పుస్తకాల రవాణాలో జాప్యం జరుగుతున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని జిల్లాలకు రెండు మూడు సంవత్సరాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. మరో 20 రోజుల్లో పాఠశాలల తలుపులు తెరుచుకోనుండగా ఇంకా 38 శాతం పుస్తకాలు జిల్లాలకు చేరనేలేదు. పాఠశాలలు ప్రారంభమయ్యే తొలిరోజు జూన్ 12న ఉచిత పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలోని 28,77,675 మంది విద్యార్థులకు 1,63,78,607 పుస్తకాలను ఉచితంగా అందజేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 97,10,888 పుస్తకాలు అంటే 62 శాతం మాత్రమే జిల్లాలకు చేర్చారు. మరోవైపు మే నెలాఖరు వరకు 100 శాతం పుస్తకాలు జిల్లాలకు చేర్చేలా అధికారులు చర్యలు చేపట్టారు.

గతంలో ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో పేపర్ ముడిసరుకు లభించక పుస్తకాల ముద్రణ ఆలస్యమైంది. కానీ ఈసారి ముందస్తుగానే ముద్రణ చేపట్టినా ఇంత వరకు 62 శాతం మాత్రమే పుస్తకాలు జిల్లాలకు చేరవేశారు. పుస్తకాలు ముద్రణ సంస్థ నుంచి నేరుగా జిల్లా కేంద్రంలోని గోడౌన్‌కు చేరుతాయి. అక్కడి నుంచి మండల పాయింట్లకు పంపుతారు. మండల పాయింట్ల నుంచి స్కూళ్లకు చేరిన తర్వాత వాటిని విద్యార్థులకు పంపిణీ చేస్తారు. ఇదంతా జరగాలంటే కనీసం 20 రోజులపైనే సమయం పడుతోంది.

కొన్ని జిల్లాలకు అన్ని పుస్తకాలు చేరవు. ఒకట్రెండు పుస్తకాలు ఇంకా బడులు తెరుచుకున్న నాటికి కూడా అందవు. గతేడాది ఇదే పరిస్థితి తలెత్తింది. అప్పటి దాకా విద్యార్థులు బడులకు వెళ్లి ఏమి చదువుకుంటారో, ఉపాధ్యాయులు వారికి ఎలా పాఠాలు చెబుతారో అధికారులకే తెలియాల్సి ఉంది. మరోవైపు తొమ్మిదో తరగతికి ద్విభాషా పుస్తకాలు ఇవ్వనున్నారు. ఒకే పుస్తకంలో ఇంగ్లీష్, తెలుగు రెండు భాషల్లో ముద్రించి పార్ట్-1, పార్ట్-2 పుస్తకాలను వేర్వేరుగా ఇస్తారు. ఈసారి పుస్తకం పేపర్ మందం కూడా పెంచారు. గతంలో 70జీఎస్ఎం ఉండగా, దాన్ని 90 జీఎస్ఎంకు పెంచిన విషయ తెలిసిందే.

# ఉద్యమనేతగా ఉజ్వల భవిష్తత్తు!

**-సుకన్యరావును అభినందించిన లయన్ మిరియం...**



హైదరాబాద్, మే 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);నేషనల్ చైర్మన్ అండ్ ఫౌండర్ లోగోస్ అసోసియేషన్ లయన్. డా. మిరియం బాబు తకబకార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అంధ్రప్రదేశ్ ఈబీసీ మహిళా ప్రధాన కార్యదర్శిని దుస్సాలువతో సత్కరించి మానవ హక్కుల ఉద్యమంలో ప్రత్యేక పాత్రబపోషించాలని అభిలసించారు. ఆమె సేవాతత్పరత, వినియోగ హక్కులు ఇంకా ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ లోని పలు భాద్యతలుబెకతాటిన నిర్వహిస్తున్న పంద్రంగి లక్ష్మిసుకన్యారావుకు ఉద్యమనేతగా ఉజ్వల భవిష్తత్తు ఉందని ఆయన అన్నారు. తన మార్గదర్శకత్వంలో ఆమెలోని నాయకత్వ లక్షణాలను మరింత మరింత మెరుగులు దిద్ది ఆమెను ఓ సంక్షేమ ఆణిత్యంగా తీర్చి దిద్దుతానని లయన్ మిరియం ఈ సందర్భంగా వక్కాణించడం విశేషం. హక్కులు, మహిళల ఉద్యమాలే కాకుండా వర్ధమాన రాజకీయ నాయకత్వంలో కూడా సుకన్య ఎంతో ఎత్తుకు ఎదగగలదని లయన్ మిరియం అన్నారు. పేదలకు బలహీన వర్గాలకు విద్యార్థులకు దివ్యాంగులకు వయోవృద్ధులు, కార్మికులకు మరిన్ని సేవలు అందించాలని సుకన్య రావుకు ఆయన సూచించారు. సుకన్య మాట్లాడుతూ తనకు ఓ గాడ్ ఫాదర్ మాదిరి మార్గానిర్దేశనం చేసున్న లయన్ మిరియం కు ఎల్లవేళలా రూపడి ఉంటానని ఆవణపై తన అభిమానాన్ని చాటుకోవటం కార్యక్రమ ప్రత్యేకత. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సుకన్యా రావు ను అభినందించారు.

# రూ.2000 నోట్ల మార్పిడిపై బ్యాంకుల సొంత నిబంధనలతో కన్ఫ్యూజన్..!

న్యూఢిల్లీ, మే23:మార్కెట్‌లో చలామణి నుంచి రూ.2000 కరెన్సీ నోటు ఉపసంహరిస్తున్నట్లు ఆర్బీఐ గత శుక్రవారం ప్రకటించింది. మంగళవారం నుంచి బ్యాంకుల్లో డిపాజిట్ గానీ, మార్పిడి చేసుకోవచ్చునని తెలిపింది. అయితే తొలి రోజు బ్యాంకుల వద్ద రూ.2000 నోట్ల మార్పిడికి వచ్చిన ఖాతాదారులు, పౌరులు, బ్యాంకర్ల మధ్య గందరగోళం నెలకొంది. ఎటువంటి గుర్తింపు కార్డు సమర్పించాల్సిన అవసరం లేదనీ ఆర్బీఐ తేల్చి చెప్పినా.. ఎస్బీఐ వంటి అతిపెద్ద బ్యాంకు నోటిఫికేషన్ జారీ చేసినా.. కొన్ని బ్యాంకులు విడిగా మార్గదర్శకాలు అమల్లోకి తెచ్చినట్లు తెలుస్తున్నది. ఆధార్ లేదా పాన్ కార్డు సమర్పించాలని, నిర్దిష్ట ఫామ్ నింపాలని బ్యాంకర్లు సూచించారు. కొన్ని బ్యాంకుల చిన్న శాఖల వద్ద కొద్ది పాటి క్యూలైన్లలో ఖాతాదారులు నిలబడటం కనిపించింది.

## ప్రైవేట్ బ్యాంకుల్లో ఇలా రూల్స్

కొటక్ మహీంద్రా బ్యాంకు, హెచ్ఎస్బీసీ బ్యాంకు వంటి ప్రైవేట్ బ్యాంకులు నాన్ అకౌంట్ హోల్డర్ల గుర్తింపు కార్డులు సమర్పించాలని, ఒక ఫామ్ నింపాలని కోరాయి. ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు రూ.2000 కరెన్సీ నోట్లు డిపాజిట్ చేయడానికి ఖాతాదారులను ఫామ్ నింపాలని సూచించాయి. ఇతరులను గుర్తింపు కార్డులు సమర్పించాలని స్పష్టం చేశాయి. యాక్సిస్ బ్యాంక్, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్, యస్ బ్యాంకు, కెనరాబ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) వంటి బ్యాంకులు ఐడీ ప్రూఫ్ లేకుండానే నగదు మార్పిడికి అనుమతించాయి.

## నోట్ల మార్పిడికి బదులు డిపాజిట్లకు ప్రోత్సాహం

కొన్నిబ్యాంకులు రూ.2000 నోట్ల మార్పిడికి ఎలక్ట్రానిక్ ఎంట్రీ నిబంధన పాటించాయి. మరి కొన్ని బ్యాంకులు తమ వద్ద ఉన్న రిజిస్టర్లలో సంబంధిత వ్యక్తుల ఫోన్ నంబర్లు, పేరు నమోదు చేయించాయి.

కొన్ని బ్యాంకులు నగదు మార్పిడికి బదులు డిపాజిట్లను ప్రోత్సహించాయని కస్టమర్లు చెప్పారు.

## రూ.2000 నోటు మార్పిడికి 131 రోజుల గడువు

2016 నవంబర్ 8 రాత్రి తక్షణం నాటి పెద్ద నోట్లు రూ.1000, రూ.500 రద్దు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. దేశ కరెన్సీలో 86 శాతం తక్షణం చెల్లవని తేల్చి చెప్పడంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది.

కానీ, రూ.2000 నోటు మార్పిడి లేదా డిపాజిట్‌కు 131 రోజుల గడువు ఇవ్వడంతో ప్రజల్లో అంతగా ఆందోళన కనిపించలేదు. రూ.2000 సెప్టెంబర్ 30 వరకు చెల్లుబాటవుతుందని కూడా ఆర్బీఐ స్పష్టతనిచ్చింది. రూ.50 వేలు దాటిన డిపాజిట్లకు పాన్ కార్డు సమర్పించాలన్న పాత నిబంధన వర్తిస్తుందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సోమవారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

# అందరి సహకారంతో చాత్తద శ్రీ వైష్ణవ సంఘ భవనం పూర్తి చేస్తా

**-చాత్తద శ్రీ వైష్ణవ సంఘం అధ్యక్షుడు శ్రీమాన్ ఆశ్వాపురం వేణు మాధవ్**



హైదరాబాద్ మే 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):తెలంగాణ రాష్ట్ర చాత్తద శ్రీ వైష్ణవ సంఘం అధ్యక్షుడు శ్రీమాన్ ఆశ్వాపురం వేణు మాధవ్ జన్మ దినోత్సవ వేడుకలు అరవింద దంపతుల సమక్షంలో వైభవంగా వారి కార్యాలయంలో నిర్వహినీ చిన సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. కేశవ్ కుమార్ పాల్గొని వారికి శుభా కాంక్షలు తెలిపారు. వీరితో పాటు శ్రీయుతులు తులసి సత్యనారాయణ , రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర కోశాధికారి టి. కృష్ణ స్వామి, రాష్ట్ర సాంప్రదాయ కార్యదర్శి రాంగోపాల్,హైదరాబాద్ జోన్ ఉపాధ్యక్షులు అయ్యావారి ప్రభాకర్ పుష్పాంజలి దంపతులు,ఒః. నగర్ శాఖ నాయకులుకురుపతి శ్రీనివాస్, తిరునగరి కాంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేణు మాధవ్ మాట్లాడుతూ అతిపెద్ద విజయం రాష్ట్ర ప్రభుత్వ అధికారికంగా ప్రకటించి మన బంధువుల కోసం ఆత్మ గౌరవ భవనం అన్నారు. పిర్జాది గూడ లో "ఎకరం భూమి " నిర్మాణం కోనం కోటి రూపాయలు ప్రకటించింది. అతి త్వరలోనే నూతన కార్యలయ భవనం మీ అందరి సహకారంతో పూర్తి చేస్తానని స్పష్టం చేసారు. చాత్తద శ్రీ వైష్ణవ బందువుల సంక్షేమం కోసమే అన్నట్టుగా ఆ రామానుజుల వారి యొక్క అద్భుతమైన అవకాశం అని భావిస్తూ, ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నాన ని అన్నారు.

# డివైయఫ్ఐ ఆలిండియా సమావేశాలు

**- మే 27,28 తేదీలలో జరిగే డివైయఫ్ఐ ఆలిండియా కమిటీ సమావేశాలను జయప్రదం చేయండి**
**- డివైయఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ పిలుపు**
**- మే 26న రాష్ట్ర స్థాయి సెమినార్,హాజరుకానున్న ఆలిండియా నాయకత్వం**




ఖమ్మం, మే23: (నేటినిజం ప్రతినిధి): దేశంలో మోడీ,బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాటాల రూపకల్పనకు మే 27,28 తేదీలలో హైదరాబాద్ లో జరిగే డివైయఫ్ఐ ఆలిండియా కమిటీ సమావేశాలను నిర్వహిస్తూ జయప్రదం చేయాలని డివైయఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక వైరా పట్టణంలోని బోడేపుడి వెంకటేశ్వర్లు భవన్ లో డివైయఫ్ఐ వైరా నియోజకవర్గ సమావేశం పట్టణ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి చింతల రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ..తొమ్మిదేళ్ల కాలంలో మోడీ,బీజేపీ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందారని,ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను కల్పించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా మోడీ బీజేపీ ప్రభుత్వనికి ఎదురుగాలి ఇస్తుందని, వచ్చె ఎన్నికలలో మోడీ,బీజేపీనీ ఓడించేందుకు యువత సిద్ధం కావాలని ఆయన పిలు?నిచ్చారు. నేడు బీజేపీ,మోడీ అవలంబిస్తున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరకంగా చర్చించి భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పనకు మే 27,28 తేదీలలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డివైయఫ్ఐ ఆలిండియా కమిటీ సమావేశాలను నిర్వహిస్తున్నామని,26న రాష్ట్ర స్థాయి సెమినార్ జరుగుందని,ఈ కార్యక్రమాలలో డివైయఫ్ఐ ఆలిండియా నాయకత్వం హాజరవుతున్నారు. యువత ఈ కార్యక్రమాలలో పాల్గొని జయప్రదం చేయగలరని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైయఫ్ఐ యంగ్ ఉమెన్ జిల్లా కో-కన్వీనర్ మరపాటి సుజాత,వైరా నియోజకవర్గం నాయకులు చిత్తరు మురళి,షేక్ యాకూబ్,మురళి,సురేష్,సాగర్,ప్రవీణ్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.




# అప్పలాయగుంట ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి, మే23: తిరుపతిలోని అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్నిమంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు.

ఉదయం 8 నుండి 10.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంలో భాగంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీ గడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. ఆలయంలో మే 31 నుంచి జూన్ 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనుండడంతో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ అర్చకులు వివరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే వాహన సేవల వివరాలను వెల్లడించారు. 31న ధ్వజారోహణం-పెద్దశేష వాహనం, జూన్ 1న చిన్నశేష వాహనం, హంస వాహనంపై స్వామివారు ఊరేగుతారని చెప్పారు. 2న సింహ వాహనం, ముత్యపుపందిరి వాహనం,3న కల్పవృక్ష వాహనంపై కల్యాణోత్సవం, సర్వభూపాల వాహనంపై విహరిస్తారని వెల్లడించారు. 4వ తేదీన మోహినీ అవతారంలో గరుడ వాహనంపై దర్శనమిస్తారని వివరించారు. 5వ తేదీన హనుమంత వాహనం,గజ వాహనం, 6న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 7న రథోత్సవం, అశ్వవాహనంపై ఊరేగుతారని పేర్కొన్నారు. 8న చక్రస్నానం, ధ్వజావరోహణం నిర్వహిస్తామని తెలిపారు.

# 2023-24 కార్య ప్రణాళిక లక్ష్యం మేరకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి:జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్




ఖమ్మం, మే23: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా 2023-24 కార్య ప్రణాళిక లక్ష్యం మేరకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం ఐడిఓసి లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అధికారులతో కలిసి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో హరితహారం, స్వచ్ఛ సర్వేక్షన్, ఉపాధి హామీ పనులు, తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూచించిన లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో బృహత్ పల్లె ప్రకృతి వనాలు, హార్టికల్చర్, టేక్ బండ్ ప్లాంటేషన్, కెనాల్ బండ్, అవెన్యూ ప్లాంటేషన్, హరితవనాలు, కమ్యూనిటీ ప్లాంటేషన్, ఇన్స్టిట్యూషన్ ప్లాంటేషన్, హోమ్ స్టెడ్ క్రింద 1987750 మొక్కలు నాటుటకు లక్ష్యంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. మండల వారిగా గ్రీన్ యాక్షన్ ప్లాన్ రూపొందించి లొకేషన్లను గుర్తించినట్లు ఆయన అన్నారు. జిల్లాలోని 589 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించినట్లు, 313068 యాక్టివ్ వేజ్ సీకర్లు ఉన్నట్లు, 69548 వేజ్ సీకర్లు రిపోర్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. ఉపాధి హామీ కూలీల పెంపుకు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. పని ప్రదేశాల్లో ఎండ తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని, నీడ, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, పనులు ఎండ తీవ్రత పెరగక ముందే ముగించేలా చూడాలని అన్నారు. జిల్లాలో 754 ఆవాసాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు లక్ష్యం కాగా, 480 చోట్ల స్థల గుర్తింపు చేసి, 468 పనులను గ్రౌండింగ్ చేపట్టి, 460 పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మిగులు క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ-2023లో గ్రామ,జిల్లా స్థాయిలో సెల్ఫ్ అసెస్మెంట్ లో నిర్దేశిత లక్ష్యాల మేరకు మార్కులు పొందే విధనీగా చర్యలు తీసుకోవాలని,స్వచ్ఛ సర్వేక్షన్ లో ప్రత్యేక శ్రద్ధ వహించి,ప్రజలకు అవగాహన కల్పించి,చైతన్యం తేవాలని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి,శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, జెడ్పి సిఇఓ అప్పారావు, డిఆర్డీవో విద్యాచంద^న, డివిజనల్ పంచాయతీ అధికారులు పుల్లారావు, ప్రభాకర్,అధికారులు పాల్గొన్నారు.

# నేడు కొవ్వూరులో సీఎం జగన్ పర్యటన..

అమరావతి, మే23:తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో 24న (రేపు) సీఎం వైఎస్ జగన్ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా జగనన్న విద్యాదీవెన పథకం లబ్ధిదారుల ఖాతాల్లో జగన్ నగదు జమచేయనున్నారు. ఈ మేరకు సీఎంఓ షెడ్యూల్ విడుదల చేసింది. రేపు ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి కొవ్వూరు చేరుకుంటారు. అక్కడ సత్యవతి నగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. ఇక బహిరంగ సభలో ప్రసంగించిన అనంతరం జగనన్న విద్యాదీవెన పథకం లబ్దిదారుల ఖాతాల్లో నగదు జమచేయనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం సీఎం జగన్ కొవ్వూరు నుంచి బయలుదేరి మధ్యాహ్నం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.